అంతర్జాతీయ తెలుగు విశ్వవిద్యాలయం పెట్టాలి

-మాజీ గవర్నర్ సి.హెచ్. విద్యాసాగర్‌రావు

జ్యోతి వెలిగించి సభను ప్రారంభిస్తున్న అతిథులు.

సభలో ప్రసంగిస్తున్న మాజీ గవర్నర్ సి.హెచ్. విద్యాసాగర్‌రావు.

సభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా॥కె.వి.రమణాచారి. వేదికపై శ్రీలక్ష్మీ, సి.హెచ్. విద్యాసాగర్‌రావు, వి.వి.లక్ష్మీ నారాయణ.

తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులు చర్చించుకుని తెలుగు భాష అభివృద్ధికి ఒక మార్గం కనిపెడితే అదే మార్గంలో తాము వెళ్లేందుకు సిద్దంగా ఉన్నామని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీ.హెచ్. విద్యాసాగర్ అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఒక అంతర్జాతీయ తెలుగు వర్సిటీ ఏర్పాటు చేయాలని, 10 సరైన ప్రాంతాలు ఎంపిక చేసి దానికి అనుసంధాన వర్సిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. 'అక్షరయాన్ తెలుగు రచయిత్రుల, కవయిత్రుల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు కేవీ. రమణాచారి, సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి. లక్ష్మీనారాయణ, అక్షరయాన్ అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీలక్ష్మి, కార్యదర్శి మహిత కౌండిన్య, హైదరాబాద్ ప్రతినిధి సమ్మెట విజయ పలువురు కవయిత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన షేక్ బడేసాబ్, షేక్ హసీనా, తిరుమల శ్రీనివాసాచార్య,

(మిగతా 5వ పేజీలో...

అక్షరానికి ప్రాణంపోస్తున్న రచయిత్రుల "అక్షరయాన్"

అక్షరయాన్ తెలుగు విమెన్ రైటర్స్ ఫోరమ్ 2019 జూన్ లో ఏర్పాటు అయ్యింది..సామాజిక హితం కోరేదే సాహిత్యం అన్న విశ్వాసంతో సామాజిక చైతన్యంతో కలిసి కట్టుగా పయనం సాగిస్తోంది.

చదువుకున్న వారిగా, హృదయమున్న వారిగా చదివిన చదువును సార్థకం చేసుకుంటూ మహిళలపై జరిగే అత్యాచారాలని, అన్యాయాలను చూస్తూ చలించిన మనస్సులతో ఒక్కటిగా చేరి అక్షరం ఆయుధంగా ..సమాజంలో మార్పును తీసుకు రావాలని, కలాలన్నీ ఒక్కచోట చేరి సంఘటితంగా నిలబడాలన్న సంకల్పానికి ప్రతిరూపమే ఈ అక్షరయాన్.

తొలి సమావేశం అక్షరయాన్- పేరుతో 40 మంది రచయిత్రులతో మొయినాబాద్‌లో 2019 జూలై 14 తేదీన ప్రారంభమైంది. మొయినాబాద్ రిసార్టులో తొలి సమావేశం నాళేశ్వరం శంకరం గారి ప్రసంగంతో ప్రారంభమై ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణాధికారి సి. యస్ .రాంబాబుగారి ప్రసంగంతో ముగిసింది.పసిపిల్లలపై జరుగుతున్న అత్యాచారాలపై వెంటనే ఒక కార్యక్రమం చేపట్టాలనే నిర్ణయాన్ని తొలి సమావేశంలో తీసుకోబడింది.

అక్షరయాన్ చేపట్టిన రెండవ కార్యక్రమం కవిసమ్మేళనం . అనుకున్నదానిని చిత్తశుద్ధితో ఆచరిస్తూ 20 మంది కవయిత్రులతో పసిమొగ్గలు పేరుతో ఆకాశవాణిలో ప్రత్యక్షప్రసారంగా కవిసమ్మేళనం అయినంపూడి శ్రీలక్ష్మి, మోహిత కౌండిన్య, రాంబాబు గార్ల సహకారంతో నిర్వహించబడింది. శ్రీమతి శైలజ సుమన్, శ్రీమతి మమత రఘువీర్ , రాష్ట్ర పురస్కార గ్రహీత కోట్లవెంకటేశ్వర రెడ్డి, దీప్తి రావుల తదితర ప్రముఖుల సమక్షంలో కవిసమ్మేళన నిర్వహణ జూలై లో మనోరంజకంగా కొనసాగింది.

అక్షరయాన్ మూడవ కార్యక్రమంగా రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో **8-8-2019న** ఫేస్ టు ఫేస్ విత్ సెల్ఫీ ఆఫ్ సక్సెస్ బుర్రా వెంకటేశం ఐ ఎ ఎస్ గారి పుస్తక విజయంలో పాలుపంచుకోవడం . వ్యక్తిత్వ వికాసం చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంగీత నాటక అకాడమి ఛైర్మన్ బాద్మి శివకుమార్, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి మామిడి హరికృష్ణ గారు, ఆకాశవాణి డైరెక్టర్ శ్రీ ఉదయశంకర్ గార్లు పాల్గొన్నారు... బుర్రావెంకటేశం గారు అత్యధికంగా అమెజాన్ లో అమ్ముడుపోయిన తన **సెల్ఫీ ఆఫ్ సక్సెస్** పుస్తకం గురించి చేసిన ప్రసంగం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

అదేరోజు మధ్యాహ్నం అక్షరయాన్ రచయిత్రులు తమలో ఒకరైన ప్రముఖ కథా రచయిత్రి కె.బి.లక్ష్మి హఠాత్తుగ మరణించినందున వారి పిల్లల సమక్షంలో ఒక సంతాప సభను ఏర్పాటు చేశారు. రచయిత్రులందరూ తమ అనుభవాలను పంచుకోవడం ఆమెకు నివాళి గడించడం జరిగింది. ఈ సభలో కెబి లక్ష్మి పిల్లలను ఆహ్వానించడం వారిరువురి స్పందన అందరికీ కంటతడి పెట్టించింది. ఆ కార్యక్రమాన్ని కె.బి . లక్ష్మికి నివాళిగా యూట్యూబ్‌లో పొందుపరిచారు.

17-10-2019న హైదరాబాద్ లో తెలంగాణ స్టేట్ పోలిస్ విమెన్ వింగ్ కార్యాలయం సమావేశహాల్లో భరోసా వారి ఆధ్వర్యంలో అక్షరయాన్ రచయిత్రుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమం తరుణి వ్యవస్థాపకులు డా. మమతా రఘువీర్ ఏర్పాటుచేసారు. అక్షరయాన్ వ్యవస్థాపకులు ఐనంపూడి శ్రీలక్ష్మి గారి ప్రారంభోపన్యాసం , అనంతరం మమతా రఘువీర్ గారు భరోసా అందిస్తున్న సేవలు , సాధించిన విజయాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తో వివరిస్తూ సంబంధిత వీడియోలను ప్రదర్శించారు. భరోసా కేంద్రం నిర్వహణ పనితీరు, రేప్ కు గురైన వారిని ఇతరత్రా హింసలు ఎదుర్కున్న వారిని ఎలా రిసీవ్ చేసుకుంటారు వారికి ఎలా ధైర్యం చెప్తారు వారిని భరోసా కేంద్రంలో మామూలుగా ఎటువంటి భయం లేకుండా తగిన ఏర్పాట్లు చేస్తారో ఏయే జాగ్రత్తలు తీసుకుంటారో కళ్ళకు కట్టినట్లు వివరించారు.

తరువాత పోలీసు అదనపు కమిషనర్ శ్రీమతి స్వాతి లక్రా అద్భుతమైన ప్రసంగంతో పోలీసు వ్యవస్థ భరోసా ద్వారా , షీ టీమ్స్ ద్వారా చేస్తున్న పనితీరును వివరించారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలను రచనలద్వారా అందించి ఆ సమస్యలను ఎదుర్కునే దిశలో పయనించేలా మహిళలను చైతన్య వంతులను చేయ్యాల్సిన బాధ్యత రచయిత్రులదే అన్నారు.

అనంతరం ఎసిపి దారా కవిత గారు షీ టీమ్స్ చేస్తున్న విధివిధానాలను కూలంకషంగా చర్చించారు. స్వయంగా ధారాకవితగారు కూడా సాహితీకారులన్న విషయం చెప్పారు. ఈ కార్యక్రమంలో డిజిపి రమణ గారు.

అడ్వకేట్ స్పందన రమణిగారు, ఫాస్ట్ ట్రాక్ ట్రయల్ స్పెషల్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతాపరెడ్డిగారు పాల్గొన్నారు.

రచయిత్రులలో కొందరు బ్రేక్ ద సైలెంట్ అంటూ షీటీమ్ ను తాము ఎలా ఉపయోగించుకున్నది తమ అనుభవాలను పంచుకున్నారు.

బాధితులు కొందరు వారు ఎదుర్కొన్న అరాచకాన్ని వారికి భరోసా అందించిన చేయూతని వివరించారు. అందరి కథనాలు కన్నీరు పెట్టించాయి. కొన్ని వింటూంటే గుండె పట్టేసింది. రాత్రి నిద్ర కరువయింది. కొద్ది సేపు వింటేనే పరిస్థితి ఇలా ఉంటే బాధితుల అనుభవిస్తున్న హింస ఎంత వేదనాభరితమో అనిపించింది.

కంటతడి సమస్యకి పరిష్కారం కాదనిపించింది.. బాధితులకు సహాయాన్నందించడానికి అక్షరయాన్ సభ్యురాలు సుజాత శేఖర్ అదే విషయాన్ని ప్రకటించగానే 36,000 రూపాయలతో 6 కుట్టు మిషన్స్‌ని విరాళంగా ఇవ్వడానికి ముందుకొచ్చిన కవయిత్రుల మానవీయత ఇక్కడ ప్రశంసనీయం.

భరోసా నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమం అందరినీ కదిలించి రచయిత్రులను కలం పట్టి అత్యాచార , గృహహింస బాధిత స్త్రీల సమస్యలను కథల రూపంలో వెలికి తీసే పనికి పురమాయించింది. షీ టీమ్స్ పని తీరును ప్రశంసించిన రచయిత్రులకు షీటీమ్స్ మీద కవితలు రాయమనేఅవకాశం డిజిపి స్వాతి లక్రా గారి ద్వారా రచయిత్రులకు కలిగించారు. మూడు ఉత్తమ కవితలకు షీ టీమ్స్ వార్షికోత్సవంలో బహుమతులిచ్చి ఉత్తమ కవితను వార్షికోత్సవంలో చదివే అవకాశం కలిగిస్తామని... రాసిన కవితలను పుస్తకంగా వెలువరిస్తామని షీ టీమ్స్ ప్రకటించింది. దూసుకుపోయిన కవయిత్రులు తక్కువ టైం లోనే కవితలను అందించారు.. ఉత్తమ కవితగా అయినంపూడి శ్రీలక్ష్మి కవిత ఎంపికయి 25-10-2019 న షీ టీమ్స్ వార్షికోత్సవంలో చదవగా పలువురి ప్రశంసలకు నోచుకుంది.

పూల సింగిడి..జాగృతి వారి ఆధ్వర్యంలో ప్రచురింపబడ్డ అతి గొప్ప కవిత్వ సంపుటి. బతుకమ్మ మీద 316 మంది కవయిత్రులు రాసిన కవితలతో సంకలనం చేసిన అతి పెద్ద కవితా సంపుటి.. 30-10-2019 నాడు పెద్దయెత్తున బతుకమ్మ ఆటపాటలతో కవిసమ్మేళనాలతో సంబురాలు జరిగాయి.

ఈ కవితలన్నింటినీ సేకరించి సహకరించింది అక్షరయాన్. కార్యక్రమంలో ఆకాశవాణి డిప్యూటి డైరెక్టర్ జనరల్

శైలజ సుమన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి పూలసింగిడి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇంతమంది కవయిత్రుల కవిసమ్మేళనంతో బతుకమ్మను కీర్తించడం బతుకమ్మకి ఇస్తున్న గౌరవమని ప్రశంసించారు.

అదే రోజు సాయంత్రం అక్షరయాన్ కవయిత్రులు మరోచరిత్ర సృష్టించారు . రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్ర గవర్నర్ డా॥ తమిళిసై సౌందరరాజన్ గారితో బతుకమ్మ సంబురాలలో 100 మంది రచయిత్రులు పాల్గొని పుస్తకాలన్ని పేర్చి పుస్తక బతుకమ్మను పూలబతుకమ్మతో జత చేర్చి గవర్నర్ తో కలిసి తొలిసారిగా రచయిత్రులు బతుకమ్మను ఆడారు. గవర్నర్‌తో విందులో పాల్గొన్నారు. గవర్నర్ శ్రీమతి డా. తమిళసై సౌందరరాజన్ గారు బతుకమ్మ ఆటలో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందని రచయిత్రులు మంచి రచనలు సమాజానికి అందించాలని తమ సందేశాన్నిచ్చారు.

హితైషి.. womensafety wing వారితో ఏర్పడ్డ అవగాహనతో **2020 జనవరిలో** కస్తూరిబా కళాశాలలో SHE టీమ్స్ మీద 78 మంది కవయిత్రులు రాసిన కవితలను హితైషి కవితా సంపుటిగా ఆవిష్కరించారు..సుమతి డీసీపీ గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తానే వ్యాఖ్యానం చేస్తూ విభిన్నంగా సభను నడిపించారు సుమతి గారు. సీనియర్ రచయిత్రి శీలా సుభద్రాదేవి ఆత్మీయ అతిథిగా విచ్చేసి హితైషిని ఆవిష్కరించడం అందరికి నచ్చింది..అక్షరయాన్ రచయిత్రి శ్రీవల్లి ఆడపిల్లల భద్రత షి టీమ్ బాధ్యత మీద రాసిన పాట ని ఆవిష్కరించారు. అందరిని ఎంతో అలరించింది ఆ పాట.

గవర్నర్ డా॥ తమిళిసై సౌందరరాజన్‌తో అక్షరయాన్ బృందం

సభలో ప్రసంగిస్తున్న మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి. వేదికపై శ్రీలక్ష్మి, మామిడి హరికృష్ణ, సి. పార్థసారధి తదితరులు

విత్తన సదస్సు...అక్షరయాన్

విత్తనాభివృద్ధి సంస్థతో కలిసి విజయవంతంగా నిర్వహించిన కార్యక్రమం విత్తన సదస్సు. **డిసెంబరు 21** వతేది రెడ్ హిల్స్ లోని ఫాప్సీ భవన్ లో దాదాపు 300 మంది రచయిత్రులతో కని విని ఎరుగని రీతిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, వితనాభివృద్ధి సంస్థ రచయిత్రులకు చక్కని అవకాశం ఇచ్చి రచయిత్రులచేత మంచి రచనలు చేయించాలని పూనుకున్నది. మంత్రివర్యులు నిరంజన్ రెడ్డి గారు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి పార్థసారథి గారు, తెలంగాణ రాష్ట్రప్రభుత్వ సాంస్కృతిక శాఖ సంచాలకులు శ్రీ మామిడి హరికృష్ణ గారు, తెలంగాణ విత్తన ఉత్పత్తి సంస్థ మానేజింగ్ డైరెక్టర్ కేశవులు గారు, మోటివేటర్ డా. శివప్రసాద్ గార్లు విచ్చేసారు. మంత్రివర్యులు నిరంజన్ రెడ్డి గారు మాట్లాడుతూ యధా బీజం తథా ఫలం.. కనుక తెలంగాణ రాష్ట్రం విత్తనం కోసం చేస్తున్న కృషిని వివరిస్తూ రచయిత్రులు తలచుకుంటే ఏదైనా చేయగలరని వ్యవసాయానికి సంబంధించిన మంచి రచనలకు తమ సహకారం ఉంటుందన్నారు. ప్రపంచంలోని మేలిమి విత్తనాలన్ని ఒక్కచోట చేరినట్లు రచయిత్రులు అక్షరయాన్ గా కొలువు తీరారన్నారు.

విత్తనం గురించి ఉత్తమ రచనలకు ఆహ్వానం పలికారు . రచయిత్రులకు 20 రోజుల సమయం ఇస్తూ అందరిని ఉచితరీతిన సత్కరించింది వితనాభివృద్ధి సంస్థ..విత్తన సదస్సు అక్షరయాన్ చేపట్టిన మంచివిత్తనంగా అందరి మనసులలో పాతుకుపోయింది.

మరింత ఉత్సాహంగా ముందడుగు వేసి ఎన్ టి ఆర్ స్టేడియంలో అక్షరయాన్ రచయిత్రులు 204 నెంబరు స్టాలులో తమ రచనలను పొందుపరిచి అక్షరయాన్ స్థానాన్ని ప్రత్యేకంగా నిలుపుకున్నారు.

వీరి ఉత్సాహానికి ఊపిరి పోస్తూ **26-12-2019** న నోముల సత్యనారాణ వేదిక మీద అక్షరయాన్ గ్రూప్ చర్చ కార్యక్రమాన్ని నిర్వహించింది.

కరోనా కష్టకాలంలో సైతం మేం ఉన్నామంటూ ఆత్మ స్థైర్యాన్ని పంచుతూ ఎన్నో వందల కవితలు రాశారు అక్షరయాన్ కవయిత్రులు..24 మార్చ్ న సరికొత్త చరిత్ర అక్షరయాన్ పేరిట లిఖించ బడింది..రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు స్వయంగా అక్షరయాన్ వ్యవస్థాపకురాలైన అయినంపూడి శ్రీలక్ష్మి గారి కరోనాకి ఓ రిటర్న్ గిఫ్ట్ కవిత చదివి స్వయంగా ఫోన్ చేసి మాట్లాడటమే కాకుండా తరువాతి రోజు ప్రెస్ మీట్ లో ఇలాంటి ఆత్మ స్థైర్యాన్ని ఇచ్చే కవితలు అందరూ రాయాలని పిలునిచ్చారు. దాంతో 700లకు పైగా వీడియోల కవితలని youtub లో అప్ లోడ్ చేయటం ఓ చరిత్రాత్మక విశేషం.

..నింగిని గెలిచిన నేల..భరోసా కథల పుస్తకాన్ని **నవంబర్ 25 న** జూమ్ మీటింగ్ ద్వారా అవిష్కరించారు స్వాతి లక్రా IG గారు. తొలి ప్రతిని అందుకున్నారు భారత దేశ సినీ చరిత్రని బాహుబలి తో మలుపు తిప్పిన కథా రచయిత విజయేంద్ర ప్రసాద్‌గారు. బాలికల విభాగాన్ని జూమ్ మీటింగ్ ద్వారా ప్రారంభించారు స్వాతి లక్రా విమెన్ సేఫ్టీ వింగ్ ఐ జి గారు..

ఇంకా విత్తన సదస్సు పుస్తకాలలో..విత్తనం చెప్పిన కథలు..బీజస్వరాలు కవితా సంపుటి ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్నాయి.

ఇప్పుడు మరింత బాధ్యతతో బాగా రాయగలిగిన ఆడపిల్లలతో బాలికా విభాగాన్ని ఏర్పాటు చేసింది అక్షరయాన్..

కేవలం బాలికలని మెరుగు పరిస్తేనే సమస్య పరిష్కారం కాదని మగ పిల్లల్ని కూడా తీర్చి దిద్దాలని నిర్ణయించుకుని 2020 డిసెంబర్ లో బాలుర విభాగాన్ని కూడా ఏర్పాటు చేసింది...రచనా శైలిని మెరుగు పర్చుటంతో పాటు..చట్టపరంగా బాలికలకు/బాలురకు ఉన్న హక్కులు..పోలీస్ వ్యవస్థ అందిస్తున్న చేయూత తెలుసుకుంటూ సమాజానికి మెరుగైన పౌరులను అందించటంలో తన పాత్రను నిర్వహిస్తుంది అక్షరయాన్..

..కరోనా మీద కవితలు..అమ్మ ,మహిళ మీద పాటల పోటీలు ఏర్పాటు చేశారు. బాలిక విభాగానికి బ్రాండ్ అంబాసిడర్‌గా రచయిత్రి అద్వైత నాయుడు..చిత్రకారిణి కృతివెంటి హేమలత, బాల వాగ్గేయకారిణి శ్రీచందన. కవయిత్రి కర్రి రేణిత, శతక సాహిత్యంలో అభినివేశం ఉన్న బి. హన్సిక లు ఎంపిక కాబడ్డారు.కరోన కాలంలో పిల్లల్ని వృధాగా ఉంచకుండా లావణ్య గారితోను...చొక్కాపు సెంకట రమణ గారితోను కథ చెప్పటం ఎలా అని స్కిల్స్ అభివృద్ధి పరిచారు..**జనవరి 3 న** జ్యోతి భా పూలే జయంతి సందర్భంగా ప్రముఖ పరిశోధకులు సంగిశెట్టి శ్రీనివాస్ గారితో రచయిత్రులు ఎదిగొచ్చిన తీరు గురించి సదస్సు నిర్వహించారు..

ఈ విధంగా మొదలు పెట్టిన నాటి నుంచి అక్షరయాన్ ప్రయాణం రకరకాల కార్యక్రమాలతో రచయిత్రులను కలుపుకుంటూ పలువురికి అవకాశాలు కలిగిస్తూ చేపట్టిన ప్రతి కార్యక్రమంలో విజయాలు సాధిస్తూ ముందుకు సాగుతోంది..unity అక్షరాయాన్ బలం.. కలాలు కలిస్తే ఎన్ని అద్భుతాలు చేయొచ్చో చేసి చూపించింది..అక్షరయాన్ ఈ విదంగా ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ కార్యక్రమాల నిర్వహణ లో ముఖ్య కార్యశీలి శ్రీమతి ఐనంపూడి శ్రీలక్ష్మి కాగా అక్షరయాన్ కార్యదర్శిగా మోహిత కౌండిన్య...గాలి లలితా ప్రవల్లికలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు.

మొత్తంగా తెలంగాణను పాత పది జిల్లాలుగా విభజించుకుని ఆయా జిల్లాలకు విస్తరింపజేస్తూ వారిని కూడా భాగస్వామ్యులుగా చేయడం కోసం జిల్లా ప్రతినిధులను ఎంపిక చేశారు.

రచయిత్రులు వెనువెంట స్పందిస్తూ సమాచారం ఆయా జిల్లాల వారికి చేరవేస్తూ కార్యక్రమాలన్ని సక్రమంగా జరగడంలో తమవంతు సహాయసహకారాలందిస్తున్నారు. ఇదిలా వుండగా **జనవరి 15 వ తేదీన** అక్షరయాన్ మరో ముందడుగు వేసింది. .అక్షరయాన్ వెబ్ సైటుని ప్రారంభించారు సాహిత్య ప్రేమైక శ్రీమతి కల్వకుంట్ల కవిత గారు. ఇదే ఉత్సాహాన్ని ద్విగుణీకృతం చేసుకుంటూ, మరిన్ని పుస్తకాల ఆవిష్కరణలకోసం ఆసక్తిగా ఎదురుచూస్తూ మహిళా రచయిత్రులు కలసికట్టుగా ఉండి సాధించే అద్భుతాలకు ప్రతీకలుగా నిలిచి అక్షరయాన్ అద్భుతయాన్ గా మరెన్నో కార్యక్రమాలకు సహాయత్తమవుతుంది.

-స్వేచ్ఛ

సభలో ప్రసంగిస్తున్న సిబిఐ మాజీ జే.డి. వి.వి. లక్ష్మీనారాయణ.

అక్షరయాన్ అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీలక్ష్మి

అందరిచే ప్రతిజ్ఞ చేయిస్తున్న అతిథులు.

4వ పేజీ తరువాయి..

ప్రవీణ్‌శర్మ, తాళ్లపల్లి యాకమ్మను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ రావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారు ఈ రోజు మాతృభాషా దినోత్సవం జరుపుకోవాలని అప్పుడే మనల్ని మనం గౌరవించుకున్నట్లు అవుతుందన్నారు. సి.బి.ఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అవధానం వంటి ప్రక్రియలు తెలుగులో కాకుండా మరే భాషలోనూ లేవని అన్నారు.

మాతృభాషకు ద్రోహం జరుగుతున్నందుకు బాధగా ఉంది: డా॥ కేవీ రమణాచారి

మాతృభాషా దినోత్సవం నాడు.. అది ఎలా నిర్వహించుకుందాం అని మాట్లాడుకుందామా.. లేక మాతృభాషకు జరుగుతున్న ద్రోహం గురించి మాట్లాడుకుందాం.. అనే స్థితిలో నేనున్నా.. ఎందుకంటే ప్రభుత్వంలో నేను భాగస్వామిని కనుక. తెలుగంటే ఇష్టపడే వారు చాలా మంది ఉన్నా విధానపరమైన నిర్ణయాలు తీసుకునేవారిలో అది లోపిస్తోంది. ఎందుకో అధికార భాషా సంఘం కుంటి నడక నడుస్తోంది. మాతృభాష కోసం చేయడానికి ఎంతో ఉన్నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏం చేయడం లేదు. తెలుగంటే బాగా ఇష్టపడే గౌరవనీయులు, తెలుగులో ఎమ్మే చేసిన గౌరవనీయులు, తెలంగాణ ఏర్పడగానే రెండవ సంవత్సరంలో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించడం ప్రపంచమంతా ఉండే తెలుగువారికి అది ఏమి పద్యాలాపన, ఏమి ఉపన్యాసం అని అందరితో కొనియాడబడ్డ ప్రభుత్వంలో కూడా తెలుగుకు కావాల్సిన ముందుంజ లేకపోవడం దురదృష్టకరం, తెలుగు గురించి బాగా పట్టించుకుని ఎంతో చేయడానికి అవకాశం ఉందని ఆశించిన వారికి కూడా సంవత్సరాలు గడుస్తూనే ఉన్నాయి. మళ్లీ సంవత్సరం అయితే ఎన్నికలు వస్తాయి అప్పుడు మాతృభాఫ గూర్చి పట్టించుకుంటున్నామంటే నమ్మాలా.. నమ్మకూడదా.. అన్న విషయాన్ని నేనే వదిలేస్తున్నా.. గత సంవత్సరం మాతృభాష దినోత్సవం రోజు నాకు విద్యాసాగర్‌రావు సన్మానం చేస్తే పద్మశ్రీ వచ్చినట్లు ఆనందించా. కానీ, నేను ప్రభుత్వ సలహాదారునిగా ఉండి మరింత చెప్పేందుకు సత్కరించి ఉంటే అందులో నేను ఓడిపోయి ఉంటే ఆయనకు నమస్కారం చేస్తున్నా. సలహాదారు అంటే.. అడిగితేనే సలహాలు ఇవ్వాలని, అడగపోతే సలహాలు ఇవ్వకూడదని కానీ అడిగేవారెవరు ఈ కాలంల..' అని అన్నారు.

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాషకు సేవచేసిన పలువురు భాషాభిమానులకు సత్కారం..

శ్రీ షేక్ బడేసాబ్
తెలుగు భాషా ప్రచారకర్త

డా॥ తాళ్లపల్లి యాకమ్మ
రచనా విభాగం

తిరుమల శ్రీనివాసా ఆర్య
భారతీయ సంస్కృతీ వికాసం

డా॥ షేక్ హసీనా
పత్రికారంగ వికాసం

శ్రీ ప్రవీణ్ శర్మ
విద్యార్థుల్లో శతక సాహిత్య ప్రోత్సాహక కర్త

మా హసన్ బీ (తల్లి) పేరుతో తెలుగు వాచకం రూపకర్త..తెలుగు భాష అభివృద్ధి కోసం నాలుగు దశాబ్దాలుగా సేవ చేస్తున్న **షేక్ బడే సాహెబ్**గారికి,

రాజకీయ రంగంలో స్త్రీలు అనే అంశం మీద ఆరు పుస్తకాలు రాసి జాతీయ,అంతర్జాతీయ పత్ర సమర్పణలతో పాటు పలు విశ్వ విద్యాలయాల్లో గెస్ట్ ఫ్యాకల్టీ లెక్చరర్‌గా పనిచేస్తూ ఒక ఛానెల్ లో న్యూస్ ఎడిటర్‌గా అనుభవం సాధించిన జర్నలిస్టు **అతీషేక్** హసీనాగారికి,

బోయ జంగయ్య రచనల మీద phd చేసిన రచయిత్రి..చదువుకునేందుకు ఎంతో పోరాటం చేసి దళిత సామాజిక వర్గంలో తెలుగు భాషాభివృద్ధి కోసం పాటుపడుతూ 6 సాహిత్య పుస్తకాలు రాసిన "కెరటం"... నవలతో తెలుగు సాహిత్యంలో కొత్త ఒరవడి తెచ్చిన **డా॥తాళ్లపల్లి యాకమ్మ**గారికి,

వృత్తి క్షవరసాల.. ప్రవృత్తి వైదికం..నిత్యాగ్ని హోత్రం..భారతీయ సంస్కృతిని పెంపొందింస్తూ ..2013 నుండి 100 విద్యాసంస్థల్లో నెల నెల కవితా యజ్ఞం పేరుతో చిన్న పదాలతో కవిత్వం పట్ల విద్యార్థుల్లో ఆసక్తి కలిగిస్తూ సాహితీ యజ్ఞం చేస్తూనే "సుడుగు పిడుగులు" ఉద్యమ కవితా సంకలనాన్ని అందించిన ఆశుకవి **తిరుమల శ్రీనివాస్ ఆర్య** గారికి,

తెలుగు ఉపాధ్యాయుడిగా పిల్లలకి వ్యాకరణం పట్ల..భాష పట్ల పట్టుని పెంచి పిల్లలతో 4 శతకాలు రాయించిన తెలుగు భాషార్చకులు..పద్యకవి **ప్రవీణ్ శర్మ**గారికి జ్ఞాపికా, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఈ సభలో ఈ క్రింది పుస్తకాల ఆవిష్కరణ జరిగింది.
మరియు రచయిత్రి గురించి పుస్తకం గురించి వివరాలు..

1.'ఎద సవ్వడి' పుస్తక రచయిత్రి **శ్రీమతి యలమర్తి అనూరాధ** గత 47 సంవత్సరాలుగా సాహితీ సేద్యం చేస్తూ 5 నవలలు, 200ల కథలు, 500ల కవితలు , 500ల వ్యాసాలతో ప్రతి రచనా ప్రక్రియలోనూ తనదైన ప్రతిభను కనబరిచి 6 పుస్తక ఫలాలను అందించారు. ఉత్తమ సాహితీ అవార్డు, గుర్రం జాషువా, రావూరి భరద్వాజ వంటి ఎన్నో సాహితీ అవార్డులను, పురస్కారాలను సొంతం చేసుకున్నారు. ఆకాశవాణి మరియు దూరదర్శన్‌లకు ముఖ్యఅతిథిగా, వక్తగా చిరపరిచితురాలు. మారుతున్న తరాలకు అనుగుణంగా వీరి రచనలు సాగుతుంటాయి.

మనసు పలికిన కవితలు. కాదేదీ కవితకు అనర్హం అన్నట్లు రచయిత్రి కలం నుంచి జాలు వారిన అక్షర పుష్పాలు. సమాజానికి అద్దం పడుతూ సామాజిక



స్పృహను కల్పించేవి.పలువురు సాహితీ ప్రముఖుల ప్రసంశలు పొందినవి.

2. 'మైండ్ ఎ మెరాకిల్' రచయిత్రి **తమిరిశ జానకి** రచనా వ్యాసంగం మొదలుపెట్టి అరవైసంవత్సరాలు పూర్తి అయ్యింది. వివాహానికి ముందు వై.జె.అనే పేరుతో రాసేవారు. వివిధ పత్రికల్లో ఇప్పటివరకూ సుమారు 350--400

వరకూ వచ్చాయి. 16 నవలలు 250 కవితలు వ్రాసారు. హైద్రాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం వారినుండి రెండుసార్లు పురస్కారాలు అందుకున్నారు. మద్రాసు కేసరి కుటీరం వారు స్వర్ణ కంకణంతో సత్కరించారు. అమెరికా , కెనడాలలో కూడా సన్మానాలు జరిగాయి.

మనసు స్పందించి కథలు రాసినట్లే, కవితలు కూడా రాయడం జరుగుతూ ఉంటుంది. ప్రస్తుతం కొన్నింటిని ఆంగ్లంలోకి అనుసృజన చేయించారు. పుస్తకంలోని కవితలు అన్నీ కూడా సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తూ పాఠకుల ఆలోచనా దృక్పథాన్ని విస్తృత పరిచేవిగా ఉంటాయి.

3. "ఎబిలిటి ఇన్ డిజేబిలిటి" పుస్తక రచయిత్రి **డా.గురజాడ శోభాపేరిందేవి** వయోధికుల సమస్యలపై పీహెచ్డీ చేసి ,వారికోసం న్యాయ పోరాటం చేస్తున్న రచయిత్రి. సోషల్ జెరొంటోలజిస్ట్ అయిన వీరు పెద్దలపై విభిన్న స్ఫూర్తిమంతమైన పరిశోధనాత్మక పుస్తకాలు రాసారు. సీనియర్స్ సెర్వింగ్ సీనియర్స్ సంస్థని ప్రారంభించి ,బబబ బలివవబి 60 అనే యూట్యూబ్ ఛానల్ ద్వారా వారి కళలూ కలలూ,ఆశలూ ఆశయాలను ప్రోత్సహిస్తున్నారు .దివ్యాన్గుల కై కలంతోనూ నూ కరంతోనూ పూతం అందిస్తున్నారు. వీరి పుస్తకాలు 13 అచ్చై కొన్ని అవార్డులు సైతం అందుకున్నాయి.

వైకల్యం.. వ్యక్తి పురోగతికి ఎన్నడూ అవరోధం కాదని, కృషితో దివ్యాన్గులు ఆకాశం హద్దుగా విజయకేతనాన్ని ఎగురవేయగలరని నిరూపించిన తొమ్మిది కథలు' వైకల్యాన్ని అధిగమిద్దాం' అనే పేరుతొ మొట్టమొదటి దివ్యాన్గుల తెలుగు కథల సంపుటిగా మొదట అచ్చైంది. ప్రస్తుత పుస్తకం దాని ఆంగ్ల అనువాదం. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఆశించకుండా ఏమైనా చేయగలమనే ధీమా, వెక్కిరింతలని, వ్యంగ్యాస్త్రాలనీ ఛాలెంజీలుగా తీసుకుని చెయ్యెత్తి జైకొట్టించుకోగల సత్తా ను సూచించిన కథల సంపుటి ఇది.

4. సుపథ శతకం పుస్తక రచయిత్రి **సి.హెచ్.రజిత** జెడ్. పి. హెచ్. స్కూల్ , పెద్దపల్లి లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.వీరి కలం పేరు జాహ్నవి. వీరి రచనా వ్యాసంగానికి గానూ పలు పురస్కారాలను వాగ్దేవి, జ్ఞానతేజ వంటి బిరుదులను పొందారు.'సుపథ శతకము' వీరి తొలి శతకము. సమాజాన్ని , యువతను, విద్యార్థులను మేల్కొలిపే విధంగా నైతికవిలువలను తెలుపుతూ, సుగుణాలను పెంపొందింప జేసే విధంగా " రాజమార్గమౌను రజిత పథము" అనే మకుటంతో నడుస్తుంది.

5. "మరీచిక" పుస్తక రచయిత్రి **యస్.వి.కృష్ణజయంతి** సాహిత్యంలోని దాదాపు అన్ని ప్రక్రియలలోనూ వీరి రచనలు సాగాయి. పత్రికలలో ప్రచురితం అయ్యాయి. రేడియో-దూరదర్శన్‌లలో ప్రసారమయ్యి బహుమతులు గెలుచుకున్నాయి. వీరి రచనలపై పరిశోధనలు కావింపబడ్డాయి. వీరు సాహిత్యంలో భారతప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ వారి ఫెలోషిప్ పొందిన తొలితెలుగు రచయిత్రి. కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న "ఇండియన్ సొసైటీ ఆఫ్ ఆథర్స్ (ఎసిఐ)కు రెండు తెలుగురాష్ట్రాల తరపున సమన్వయకర్తగా ఉన్నారు.

అన్ని రంగాలలోనూ పురుషుడితో సమానంగా స్త్రీలు పురోగమిస్తున్న సమకాలీన పరిస్థితులలో శారీరక-మానసిక-బాహ్యాంతర్గత అంశాలలో భావోద్వేగపరంగా సున్నితంగా, సుకుమారంగా ఉంటూ... పురుషుడితో విభిన్నంగా ఆలోచించే స్త్రీ హృదయాంతర్గత భావావిష్కరణకి ఆస్కారం కల్పించే "ఆత్మాశ్రయ కవిత్వ" ధోరణిలో వెలువడిన తొలికవితాసంపుటి "మరీచిక".

6. "వాసుదేవ శతకము" పుస్తక రచయిత్రి **సారంగపుర్కర్ సుమతి:** నిర్మల్ లో ఉంటారు.ఎం.ఏ ఎకనామిక్స్, ఎం.ఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ చేసారు. గృహిణిగా ఉంటూనే తన అభిరుచులైన పుస్తక పఠనం, సమాజసేవ చేస్తుంటారు. ప్రస్తుత పుస్తకం "వందనాలుతండ్రి వాసుదేవ"శతక పద్యాల రూపంలో రచించారు. తనను కని,పెంచి , ప్రకృతిపట్ల ,సమాజం పట్ల, పెద్దవారి పట్ల ఎలా బాధ్యతగావుండాలో నేర్పించిన వారి నాన్న గారి పేరుతో...అవే విషయాలను తన పుస్తకం ద్వారా నేటి తరం పిల్లలకు ,పెద్దలకు చెప్పే ప్రయత్నం చేసారు.

7."మెలకువ చిగురించిన వేళ" పుస్తక రచయిత్రి **ఉరిమళ్ళ సునంద** పదవతరగతి పూర్తి కాగానే వివాహం జరిగింది. భర్త భోగోజు ఉపేందర్ రావు సహకారంతో చదువుకుని ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు.ప్రస్తుతం ఖమ్మం జిల్లా బోనకల్ మండలం కలకోట ఉన్నత పాఠశాలలో తెలుగు భాషోపాధ్యాయిని గా పని చేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర పాఠ్య పుస్తకాల రూపకల్పన, డిజిటల్ పాఠాలు చెప్పడంలో రిసోర్స్ పర్సన్ గా పని చేస్తున్నారు. ప్రవృత్తి రీత్యా వీరు కవయిత్రి, రచయిత్రి.. ఇంతకు ముందు ఒక కవితా సంపుటి ని, బాలగేయాల సంపుటి ని, కథా సంపుటి ని అందించారు. తాను పని చేసే పాఠశాల విద్యార్థులతో చిరు ఆశల హరివిల్లు, ఆళ్ళపాడు అంకురాలు అనే బాలల కవితల సంకలనాలు,పూల సింగిడి,కలకోట కథా సుమాలు అనే బాలల కథల సంకలనాలు తీసుకొచ్చారు.సామాజిక అంశాలతో కూడిన 'మెలకువ చిగురించిన వేళ' అనే కవితా సంపుటి.

8. "తొలకరి మెరుపులు" పుస్తక రచయిత్రి **జి.శాంతారెడ్డి** తండ్రి తెలుగు లెక్చరర్ కావడంతో వారి భాషభిమానాన్ని వారసత్వ సంపదను అందిపుచ్చుకొని ప్రభుత్వ న్యూటౌన్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయినిగా సేవలనందిస్తున్నారు.

ప్రవృత్తి రీత్యా వీరు కవయిత్రి, అక్షరయాన్ సంస్థ మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి . మొదట మౌన గీతం కవిత్వం, తర్వాత అమ్మా నాన్న ద్విశతినీ అందించారు.మెరుపులు అనే నూతన ప్రక్రియలో తొలి సంపుటిని వివిధ సామాజిక సమకాలీన అంశాలతో "తొలకరి మెరపులు"గా మన ముందుకు తీసుకువచ్చారు.

9. **"అష్టవిధ నాయికలు"** పుస్తక రచయిత్రి **జ్యోతి వలబోజు** తెలుగు బ్లాగర్గా, రైటర్గా, కుకరీ ఎక్స్పర్ట్‌గా, పత్రిక సంపాదకురాలుగా, ప్రచురణకర్తగా వీరు అందరికీ సుపరిచితురాలు. జె.వి.పబ్లికేషన్స్ ద్వారా దాదాపు 200 పుస్తకాల ప్రచురణ చేసారు. మహిళా ప్రచురణకర్తగా 2019 లో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం విశిష్ట మహిళ పురస్కారం అందుకున్నారు. కావ్య సంపుటిలో ప్రస్తుతం 'అష్టవిధ నాయికలు' 65మంది పద్యకవులు, ప్రేమికులు కలిసి సామాజిక మాధ్యమం వేదికగా అష్టవిధములైన నాయికల తీరుతెన్నులపై రాసిన పద్యాలు. ఇందులో తెలుగు రాష్ట్రాల కవులే కాక ఇతర రాష్ట్రాల, దేశాల వారు కూడా ఉన్నారు.

10."మేల్బంతి మౌక్తికాలు" పుస్తక రచయిత్రి **బొమ్ము విమల** జిల్లా పరిషత్ హైస్కూల్ కొల్తూర్ లో తెలుగు ఉపాధ్యాయుని గా పని చేస్తున్నారు.స్వతహాగా మాతృభాషాభిమాని ఐన వీరు పద్యాలు,బుర్ర కథలు,వచన కవితలు వంటి అనేక ప్రక్రియలలో రచనా వ్యాసాంగాన్ని కొనసాగిస్తున్నారు.

అనేక సాహితీ సంస్థల నుండి సన్మానాలు, పురస్కారాలు పొందారు.

దాదాపు 40 సంకలనాలలో వీరి కవితలు ముద్రించడం జరిగినది. ముద్రిత పుస్తకమైన "విమల మణి పూసలు" అనే పుస్తకానికి వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో స్థానం పొందినది.

'మేల్బంతి మౌక్తికాలు' వారికెంతో ఇష్టమైన ఇష్టపది ప్రక్రియలో వ్రాసారు.

ఈ పద్యాలు సీస పద్యాలను పోలి పది మాత్రలను కలిగి రెండు భాగాలుగా ఆది ప్రాసతో పాడుకోవడానికి వీలుగా శ్రీ కృష్ణుని నామ ముద్రతో విమల మదిలో మాట విన్నవించెద కృష్ణా! అనే మకుటంతో ఉంటాయి.

11. "అక్షరసేద్యం (కైతిక ప్రక్రియ) పుస్తక రచయిత్రి **ఐరేణి కృష్ణవేణి** తెలుగు భాషోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. విద్యార్థి దశలో స్పందించి ఆగిపోయిన వీరి కలం వీరి భర్త ప్రోత్సాహంతో ఇప్పుడిప్పుడే మరలా సాహిత్యం వైపు అడుగులు వేస్తుంది.

బాలగేయాలు మరియు నాలుగు వందల పై చిలుకు వచన కవితలు రాశారు.

పలు సాహితీ సంస్థల నుండి ప్రశంసా పత్రాలను అందుకున్నారు.

గోస్కుల రమేష్ గారి ప్రోత్సాహంతో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం కైతిక ప్రక్రియలో సాగిన మొదటి రచన ఈ 'అక్షర సేద్యం'. ప్రస్తుత సమాజంలోని సమస్యలకు స్పందిస్తూ,

అన్ని కోణాలను స్పృశిస్తూ మనకు అందించారు.

12. 13. "శ్రీరామ గానామృతం", స్వరాజ్యవాణి" పుస్తక రచయిత్రి **కొల్లూరు స్వరాజ్యం వేంకట రమణమ్మ** మన దేశానికి స్వరాజ్యం సిద్ధించిన రోజున జన్మించారు. బాల్యం నుండి తెలుగు భాషపై మక్కువ కలిగిన వీరు ఆరవ తరగతి నుండే రచనలు చేయడం ప్రారంభించి నేటికీ కొనసాగిస్తున్నారు. రైల్వే పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పదవీ విరమణ చేశారు. భావితరాల్లో మాతృభాషను మరింతగా అభివృద్ధి చేయాలనే తపనతో 'బాలబాట' అనే పిల్లల మాస పత్రికను ప్రారంభించారు. వీరి సేవలను గుర్తించి పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వారు.. బాల సాహిత్యంలో విశిష్ట పురస్కారాన్ని అందించారు. భారతీయ రైల్వే వారి ద్వారా ఉత్తమ ఉపాధ్యాయురాలిగానూ, సమాజ సేవ అవార్డులను పలుమార్లు అందుకున్నారు. వీరు బాల సాహిత్యం, ప్రౌఢ సాహిత్యం, భక్తి సాహిత్యంలో 52 పుస్తకాలను రచించారు. సాహితీసుధ ,తెలుగు భాషా భూషణ్, సాహిత్య రత్న వంటి అనేక బిరుదులను పొందారు. 74 సంవత్సరాల ప్రాయంలో కూడా వీరు చేస్తున్న తెలుగుభాషా సేవ.. నేటి బాలల సర్వతోముఖాభివృద్ధికి చేస్తున్న కృషి మెచ్చుకోదగినది.

14." ఇట్లు కరోనా" పుస్తక రచయిత్రి **ఐనంపూడి శ్రీలక్ష్మి** గత 4 దశాబ్దాలుగా సాహితీ సేవ చేస్తున్నారు..11 పుస్తకాలు రాశారు..50 పైగా పుస్తకాలకి సంపాదకులుగా ఉన్నారు. రాష్ట్ర గవర్నర్ డా. తమిలసై సౌందర్యరాజన్ గారు 2020లో రాజ్‌భవన్‌లో అవిష్కరించిన కొత్త ప్రేమలేఖలు పుస్తకం విశేష ఆదరణ పొందింది.. కవిత్వమే ఓ గెలాక్సీ వీరి కవితానుభవదర్శిని..

ఈ 'ఇట్లు కరోనా ' పుస్తకం లేఖా సాహిత్యం..మనిషికి కరోనా ఉత్తరం రాస్తే ఏమి చెపుతుంది అన్నది దీంట్లో ని అంశం..100 పేజీల ఈ పుస్తకం భవిషత్ తరాలకు మార్గదర్శిగా నిలబడి ఆరోగ్య సమాజ పునర్నిర్మాణానికి ఎలా దారి చూపించగలదో తెలిపే 100 పేజీల పుస్తకం ఇది.

ఆకాశవాణిలో 30 ఏళ్లుగా పనిచేస్తున్న చేయి తిరిగిన కళా కారిని మరియు చెవులొగ్గి వినాలి అనిపించే గళా కారిణి కూడా.

అక్షరయాన్ సంస్థ అధ్యక్షురాలిగా 700 మందికి పైగా తెలుగు రచయిత్రులను ఒక్క తాటిపై తెచ్చిన కృషీవలురాలు.

ఎంతో మంది కవయిత్రులు, రచయిత్రులు పాల్గొన్న సభ ఘనంగా జరిగింది.